ప్రజాశక్తి
బుధవారం 30 నవంబర్ 2022
5
శ్రీ సత్యసాయి

## గురజాడ పురస్కారం 'చాగంటి'కి ఇవ్వొద్దు

**అనంతపురం** : సామాజిక మూఢ విశ్వాసాలకు వ్యతిరేకంగా, మహిళల అభ్యున్నతికి కషి చేసిన గురుజాడ అప్పారావు పేరున ఇచ్చే పురస్కారాన్ని మూఢవిశ్వాసాలను ప్రోత్సహించేలా ప్రచారం చేసే చాగంటి కోటేశ్వరరావుకు ఇవ్వడం సరికాదని సాహితీ స్రవంతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు పిళ్లా కుమారస్వామి తెలిపారు. విజయనగరం జిల్లాలో కొన్ని సాహితీ సాంస్కతిక సంస్థల ఆధ్వర్యంలో గురజాడ పురస్కారాన్ని ఏటా అందజేస్తున్నారన్నారు. ఈసారి ఈ పురస్కారాన్ని మూఢచార విశ్వాసాలను పాటించాలని ప్రచారం చేసే ప్రవచన కారుడు చాగంటి కోటేశ్వరరావుకు ఇవ్వాలని ఆ సంస్థలు నిర్ణయించడం సరికాదన్నారు. వితంతు వివాహాలు, స్త్రీల అభ్యున్నతిని ప్రోత్సహించిన గురజాడ ఆశయాలకు భిన్నంగా మనువాదాన్ని ప్రచారం చేసే ప్రవచన కారులకు గురజాడ పురస్కారం ఇవ్వడమంటే గురజాడ ఆశయాలను బలి తీసుకోవడమే అవుతుందని అన్నారు. గురజాడ భావజాలానికి భిన్నంగా సనాతన ధర్మం పేరిట స్త్రీల స్వేచ్ఛను హరించే ప్రసంగాలు చేసే వారికి గురజాడ పురస్కారం ఇవ్వడం గురజాడను అవమానించడమే అవుతుందని అన్నారు. గురజాడ భావజాలనికి అనుగుణంగా సమాజాభివృద్ధి సేవలు అందించే వారికే పురస్కారం ఇవ్వాలని కోరారు.

# పైసల్లేకుండానే ప్రతిపాదనలు..!

◆ 'పురం' పాలకవర్గం వింత పోకడ
◆ తాజాగా రూ.7 కోట్లకుపైగా పనులకు అంచనాలు
◆ ఇప్పటికే రూ.100 కోట్లు దాటిన ప్రతిపాదనలు
◆ జరిగిన పనులు నామమాత్రమే
◆ నేడుమున్సిపల్ కౌన్సిల్ సమావేశం

**ప్రజాశక్తి-హిందూపురం**

'మింగు మెతుకు లేదు... మీసాలకు సంపెంగ నూనె' అన్న సామెత హిందూపురం మున్సిపాల్టీకి అచ్చంగా సరిపోతోంది. గత మూడేళ్లుగా ప్రభుత్వం నుంచి పట్టణాభివద్ధికి ప్రత్యేకంగా ఒక్క పైసా నిధులు కూడా రాలేదు. మున్సిపాలీటీ ఆదాయం అంతా కలిపినా ఏడాదికి రూ.20 కోట్లలోపే. ప్రతి నెలా మున్సిపాలీ తాగునీటి పథకాలకు, వీధి దీపాలకు కలిపి విద్యుత్ ఛార్జీలు రూ.కోటి చెల్లించాలి. పొరుగు సేవల విధానంలో పని చేస్తున్న 300 మందికి పైగా ఉద్యోగులకు రూ.50 లక్షలు వేతనాల రూపంలో చెల్లించాలి. చెత్త తరలింపు వాహనాలతో పాటు ఇతరత్రా వాహనాలకు డీజిల్, మర్మతులు, అద్దెలు, మున్సిపాల్టీ సచివాలయాల నిర్వహణ తదితర వాటి కోసం రూ.50 లక్షలు ఖర్చు అవుతోంది. ప్రతి నెలా రూ. 2 కోట్లు, మున్సిపాలీ ఖాతాలో ఉంటేనే బండి నడుస్తుంది. తగినంత ఆదాయం లేకపోవడంతో గొల్లపల్లి, తాగునీటి పథకం విద్యుత్ ఛార్జీలను సకాలంలో చెల్లించలేకపోతున్నారు. దీంతో ఆర్థిక సంఘం నిధులను ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలకు మళ్లించింది. ఇటీవల 15వ ఆర్థిక సంఘం నిధుల్లో రూ.3.5 కోట్లు విద్యుత్ బకాయిల కింద మినహాయించి, మిగిలిన నిధులను మున్సిపాల్టీకి విడుదల చేశారు. మరో వైపు తాగునీటి పథకానికి గుత్తేదారుకు బిల్లులు చెల్లించకపోవడంతో ఇటీవల ప్రభుత్వం మున్సిపాల్టీ పేరిట రూ.45 కోట్లు అప్పు చేసి చెల్లించింది. దీనికి సంబంధించి ప్రతి నెలా రూ.26 లక్షలు వడ్డీ, రూ.24 లక్షలు అసలు కలిపి ఇఎంఐ రూపంలో రూ.50 లక్షలు చెల్లించాల్సి ఉంది. నిధులు లేకపోవడంతో వడ్డీ మాత్రమే చెల్లిస్తున్నారు. గుత్తేదారుకు ఇంకా రూ.50 కోట్ల వరకు బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో ఏడు ఏళ్ల పాటు నిర్వహణ చూడాల్సి ఉన్నా, అర్ధాంతరంగా తప్పుకొన్నారు. దీంతో నిర్వహణ భారం మున్సిపాల్టీపై పడింది. మరోవైపున పట్టణంలో ఎల్ఇడి వీధి దీపాలు ఏర్పాటు చేసిన గుత్తేదారుకు రూ.12 కోట్ల వరకు చెల్లించాల్సి ఉంది. గొల్లపల్లి తాగునీటి పథకం లేని సమయంలో మూడేళ్ల క్రితం వరకు పిఎబిఆర్ నుంచి నీటిని అందించిన గ్రామీణ నీటి సరఫరా విభాగానికి రూ.20 కోట్ల వరకు బకాయిలు అలాగే ఉన్నాయి. ఎల్ఇడిల సరఫరా గుత్తేదారు, గ్రామీణ నీటి సరఫరా విభాగం వారు నోటీసులు మీద నోటీసులు ఇస్తున్నా, ఖజనా సొమ్ము లేక చెల్లింపులు చేయలేకపోతున్నారు. గత మూడేళ్లుగా అభివద్ధి మాట దేవుడెరుగు... మున్సిపాల్ఠీ నిర్వహణ అతి కష్టంగా సాగుతోంది.

**ప్రతిపాదనలకు మాత్రం తగ్గేదేలే..**

మున్సిపాల్టీ నిర్వహణ కోసం అధికారులు అష్టకష్టాలు పడుతుంటే, ప్రభుత్వం నుంచి పైసా నిధులు తీసుకురాని పాలకవర్గం మాత్రం, అభివద్ధి పనుల ప్రతిపాదనల్లో తగ్గడం లేదు. ప్రతి నెలా జరిగే మున్సిపల్ సమావేశంలో కనీసం రూ.6 కోట్లకు పైగా విలువైన పనులను ప్రతిపాదనలను సిద్ధం చేయడం, కౌన్సిల్ ఆమోదం తీసుకోవడం పరిపాటిగా మారింది. 18 నెలల క్రితం ఛైర్ పర్సన్ ప్రమాణ స్వీకారం అనంతరం తొలి సంతకం రైల్వే రోడ్ విస్తరణ అంశంపై పెట్టారు. రోడ్డు విస్తరణకు తక్కువలో తక్కువ కనీసం రూ.10 కోట్లు అవసరం. రహదారి విస్తరణలో భవనాలు కోల్పోయే వారికి నష్టపరిహారం రూ. 3 కోట్లు ఇవ్వాలని నిర్ణయించారు. ఇప్పటి దాక రూ.కోటి ఇవ్వలేకపోయారు. పట్టణంలో అంతర్గత రహదారులు, మురుగు కాలువల నిర్మాణం కోసం రూ.కోట్లకు కోట్లు కేటాయిస్తూ, తీర్మానాలను ఆమోదించారు. అయితే ఆమోదం తెలిపిన పనుల్లో కనీసం 10 శాతం కూడా ప్రారంభం కాలేదు. పూర్తి అయిన పనులకు బిల్లులు చెల్లించ లేదు. దీంతో పనులు చేయడానికి గుత్తేదారులు ముందుకు రావడం లేదు. కాలనీలను సుందరంగా తీర్చిదిద్దే క్రమంలో రహమత్ పురం, అబాద్ పేట, మేళాపురంలో ఆక్రమణలను తొలగించారు. అయితే అక్కడా పనులు పూర్తి కాక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అయినా తాజాగా సోమవారం నిర్వహించే మున్సిపల్ సమావేశంలో కౌన్సిల్ ఆమోదానికి దాదాపు రూ.7 కోట్లకు పైగా విలువైన పనులను ప్రతిపాదించడానికి కౌన్సిల్ ముందు తీసుకు రావాడం గమనర్హం.

# నివురుగప్పిన నిప్పు..!

కరువుకు నిలయమైన అనంతపురం జిల్లా ముఠా రాజకీయాలకు పెట్టింది పేరు. అయితే గత కొంత కాలంగా ముఠా రాజకీయాలు సద్దుమణిగి ప్రశాంత వాతావరణం నెలకొంటోంది. ఇటువంటి తరుణంలో మరోమారు నేతల మధ్య సాగుతున్న మాటల యుద్ధాలు జిల్లా వాసులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. వ్యక్తిగతమైన దూషణలు, హెచ్చరికలు హద్దులు దాటి వస్తుండటంతో తిరిగి ముఠా కక్షలు రాజుకుంటున్నాయా అన్న సందేహాలను రెకెత్తించే విధంగా ఉంటున్నాయి.

◆ హద్దులు మీరుతున్న మాటలు
◆ మళ్లీ ముఠాకక్షలు రాజుకుంటాయన్న ఆందోళన

**ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి**

ఉమ్మడి అనంతపురం జిల్లా పరిధిలోని రాప్తాడు, ధర్మవరం, తాడిపత్రి, పెనుకొండ నియోజకవర్గాల్లో ముఠాకక్షలు అధికంగా ఉండేవి. అవి క్రమక్రమంగా తగ్గుతూ రావడంతో జిల్లావాసులు ఊపిరి పీల్చుకున్నారు. 2014 నుంచి చూస్తే ఒకటి, రెండు మినహా పెద్దగా ముఠాకక్షలు చోటు చేసుకోలేదు. 2014లో టిడిపి అధికారంలోకి వచ్చాక రాప్తాడు తహశీల్దార్ కార్యాలయంలో ప్రసాద్‌రెడ్డి హత్య ముఠా కక్షల్లో భాగంగా జరిగింది. ఆ తరువాతి కందుకూరులో ఒకటి చోటు చేసుకుంది. అటు తరువాత ఎటువంటి ఘటనలూ చోటు చేసుకోలేదు. సాధారణంగా పార్టీ అధికారం మారాక పలు హింసాయుత ఘటనలు చోటు చేసుకునేవి. 2019లో టిడిపి అధికారంలోకి పోయి వైసిపి అధికారంలోకి వచ్చాక అటువంటి ఘటనలుంటాయన్న ఆందోళన అందరిలోనూ నెలకొంది. అయితే ఇప్పటి వరకు ఉమ్మడి జిల్లాలో ప్రశాంత వాతావరణం నెలకొనడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. ఇప్పుడు సాధారణ ఎన్నికలు సమీస్తున్న తరుణంలో నేతల మాటలు మరోమారు అందరిలోనూ కలవరాన్ని సృష్టిస్తున్నాయి. రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి సోదరుడు తోపుదుర్తి చంద్రశేఖర్‌రెడ్డి మొద్దుశీనుకు చెప్పి ఉంటే చంద్రబాబు నాయుడిని హత్యచేసే వాడంటూ చేసిన వ్యాఖ్యలు సోషియల్ మీడియాలో దుమారం రేపుతున్నాయి. పరిటాల రవీంద్ర హత్య ఉదంతాన్ని ఆయన లేవనెత్తడంతో పాత రోజులను తిరిగి తీసుకురానున్నారా.? అన్న ప్రశ్న రాజకీయవర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. అంతకు మునుపు తాడిపత్రిలోనూ ఆ నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి అస్మిత్‌రెడ్డి ఒక వార్డులో పర్యటిస్తూ ఉండగా అధికారపార్టీ నేతలు రాళ్లతో దాడి ఘటన కూడా కలకలం రేపింది. రాయదుర్గం నియోజకవర్గంలోనూ ప్రతిపక్ష నాయకులపై దాడి చేసారన్న ఆరోపణలున్నాయి. ఇలా వరుసగా చోటు చేసుకుంటున్న పరిణామాలు తిరిగి ముఠాకక్షలను పెంచే విధంగా ఉన్నాయన్న భయం జిల్లావాసుల్లోనూ మొదలవుతోంది. 2007కు ముందు వరకు జిల్లాలో పెద్దఎత్తున ముఠాకక్షలు చోటు చేసుకునేవి. ఆ తరువాత ప్రభుత్వాలు తీసుకొచ్చిన చర్యలతో కాస్త తగ్గుముఖం పడుతూ వచ్చాయి. తిరిగి ఇప్పుడు జరుగుతున్న పరిణామాలతో ఏమి జరుగుతుందోనన్న భయం జిల్లా వాసుల్లో నెలకుంటోంది. ఈ ఘటనల్లో పోలీసుల తీరు పట్ల కూడా కొన్ని విమర్శలు వస్తున్నాయి. జిల్లా ఉన్నతాధికారులు కొంత వరకు కఠినంగా వ్యవహరించే విధంగా ఉంటున్నా క్షేత్ర స్థాయిలో పరిస్థితులు అందుకు భిన్నంగా ఉంటున్నాయన్న ఆరోపణలున్నాయి. నియోజకవర్గ స్థాయిలో ముఖ్య నేతల కనుసన్నల్లోనే క్షేత్రస్థాయి అధికార యంత్రాంగం పనిచేస్తున్నట్టు ప్రతిపక్ష పార్టీల నాయకులు ఆరోపిస్తున్నారు. స్టేషన్లలోనూ అధికారపార్టీ నాయకులు అధికారుల సమక్షంలోనే చేయిచేసుకున్నా మౌనంగా ఉంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. క్షేత్రస్థాయి అధికార యంత్రంగం నిష్పక్షపాతంగా వ్యవహరించకపోతే నివురుగప్పిన నిప్పులావున్న ముఠా కక్షలు మరోమారు పురుడుపోసుకునే అవకాశాలున్నాయన్న ఆందోళన సర్వత్రా వ్యక్తమవుతుండటం గమనార్హం.

# అధికారులు, బ్యాంకర్ల మధ్య సమన్వయం అవసరం

◆ రుణ మంజూరు లక్ష్యాలను చేరుకోవాలి ◆ కలెక్టర్ బసంత్ కుమార్

**ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా అమలవుతున్న వివిధ రకాల పథకాలకు సంబంధించిన రుణాలను లబ్ధిదారులకు మంజూరు చేయడంలో బ్యాంకర్లు, అధికారుల మధ్య సమన్వయం అవసరం అని కలెక్టర్ బసంత్‌కుమార్ పేర్కొన్నారు. పుట్టపర్తి కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో మంగళవారం నాడు జిల్లా సంప్రదింపుల కమిటీ, జిల్లా స్థాయి సమీక్షా కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వివిధ ప్రభుత్వ పథకాల కింద అర్హులైన లబ్ధిదారులకు రుణాల మంజూరు, పంపిణీని బ్యాంకర్లు వేగవంతంగా చేపట్టాలన్నారు. అర్హులైన లబ్ధిదారులకు రుణాల మంజూరులో బ్యాంకర్లు వెంటనే పురోగతి సాధించేలా ప్రత్యేక దష్టి సారించాలన్నారు. స్టాండప్ ఇండియా, పీఎం ముద్ర యోజన కింద రుణాలు, వీవర్స్‌కు, పశుసంవర్ధక, మత్స్య రైతులకు రుణాలు అందించడంలో మరింత పురోగతి చూపించాలన్నారు. జగనన్న తోడు పథకం కింద డీఆర్డీఏ, మెప్మా పరిధిలో చిరు వ్యాపారులకు అందించే రుణాల లక్ష్యం చేరుకోలేదని, వెంటనే అర్హత కలిగిన లబ్ధిదారులకు రుణాలను మంజూరు చేసి పంపిణీ చేసేలా చూడాలన్నారు. జగనన్న తోడు, టిడ్కో, హౌసింగ్‌కి సంబంధించి రుణాల మంజూరు చాలా పెండింగ్ ఉందని, వెంటనే కేటాయించిన లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. ఆయా పథకాలకు సంబంధించి రుణాల మంజూరులో అధికారులు, బ్యాంకర్ల మధ్య సమన్వయం సక్రమంగా ఉండాలన్నారు. రుణాల మంజూరులో ఏమైనా సమస్యలు ఉంటే వాటిని పరిష్కరించుకునేలా కషి చేయాలని, కేటాయించిన లక్ష్యాలను పూర్తిగా 100 శాతం చేరుకోవాలన్నారు. ఇకపై ప్రతి నెలా బ్యాంకర్లతో సమావేశం నిర్వహిస్తామన్నారు. ఆయా సమావేశంలో మున్సిపల్ కమిషనర్లు హాజరై విధంగా లీడ్ బ్యాంకు మేనేజర్ చర్యలు చేపట్టాలని తెలిపారు. డిఐసిసిఐ జిల్లా కోఆర్డినేటర్ సభ్యులు కెవి.రమణ మాట్లాడుతూ అర్హత కలిగిన ఎస్సీ ,ఎస్టీ, ఔత్సాహికులను ప్రోత్సహించడానికి ఉద్దేశించిన స్టాండర్డ్ ఇండియా పథకంపై అవగాహన శిబిరాలు నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలని తెలిపారు. అనంతరం బ్యాంకుల లక్ష్యాల గురించి నాబార్డ్ ఏజీఎం ద్వారా రూపొందించిన జిల్లా వార్షిక ప్రణాళికను రూపొందించారు. 2023-24కు సంబంధించి 741575.39 కోట్ల రూపాయలతో జిల్లా వార్షిక ప్రణాళికను తయారు చేసినట్లు ఎల్డీఎం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌బిఐ ఎల్‌డిఓ శరత్‌చంద్ర, ఎల్‌డిఎం సాయినాథ్ రెడ్డి, కెనరా బ్యాంకు ఏజీఎం రాంప్రసాద్ రెడ్డి ,ఎస్‌బిఐ ధర్మవరం ఆర్ఎం సంజీత్ కుమార్, యూబిఐ బ్యాంక్ ఏజీఎం అశ్వర్థ నాయక్, నాబార్డ్ డిడి ఉషా మధుసూదన్, డీఆర్డీఏ పీడీ నర్సయ్య, మెప్మా పీడీ విజయలక్ష్మి, సెరికల్చర్ జేడీ పద్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా వార్షిక రుణ ప్రణాళికను విడుదల చేస్తున్న కలెక్టర్ బసంత్‌కుమార్, ఎల్డీఎం సాయినాథ్‌రెడ్డి

# రోడ్డు గుంతల పూడిక పేరుతో దందా..

## అధికారుల పర్యవేక్షణా లోపం.. గుత్తేదారుల ఇష్టారాజ్యం

**ప్రజాశక్తి మడకశిర**

ఇటీవల కురిసిన వర్షాల ధాటికి ప్రధాన రహదారులన్ని దెబ్బతిని అడుగుకో గుంత ఏర్పడ్డాయి. అరకిలో మీటరు దూరం అరగంట సేపు ప్రయాణించే దుర్భర స్థితికి రహదారులు చేరుకున్నాయి. ఈ నేపథ్యంలో ప్రధానరహదారిలో ఏర్పడిన గుంతలను పూడ్చే పేరుతో గుత్తేదారులు, సంబందిత అధికారులు నయాదందాకు తెరలేపారన్న ఆరోపణలు వినపడుతున్నాయిజ ప్రభుత్వం రహదారుల నిర్వహణ కింద లక్షలాది రూపాయలు నిధులు కేటాయించి విడుదల చేసింది. పనులు మంజూరు అయ్యిందే తడువుగా సంబంధిత గుత్తేదారుడు ఆఘమేఘాల మీద పనులు ప్రారంభించాడు. దీంతో ఈ ప్రాంత ప్రజలు ఎంతో సంతోషించారు. అయితే గుంతలు పూడ్చేపేరుతో గుత్తేదారుడు అక్రమాలకు తెరలేపాడని ప్రజలు విమర్శిస్తున్నారు. తూతూ మంత్రంగా పనులు చేసుకుంటూ వెళుతున్నాడు. నిబందనల ప్రకారం రోడ్డుపై పడిన గుంతలను పూడ్చేటప్పుడు వెట్‌మిక్స్ వేసిన తర్వాత వైబ్రేటర్ రోలర్ ద్వారా రోలింగ్ చేయాలి. అవసరమైతే బిఎం. బిసి కంకర ను వేసిన అనంతరం తారువేసి రోలింగ్ చేయాల్సిఉంది. అయితే గుత్తేదారుడు ఆ గుంతలను శుభ్రం చేయకుండా మట్టి రోడ్డు పైనే నామమాత్రంగా తారు వేసి మమ అనిపిస్తున్నాడని స్థానికులు ఆరోపిస్తున్నారు. నాణ్యతకు తిలోదకాలు ఇచ్చి చేస్తున్న ఈ ప్యాచ్ వర్క్ ఎన్నిరోజులు ఉంటుందో అని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ పనులపై సంబందిత అధికారుల పర్యవేక్షణ కూడా అంతంతమాత్రంగానే ఉందన్న విమర్శలు ఉన్నాయి. అధికారులు, గుత్తేదారుడు కుమ్మక్కై పనులను నాశిరకంగా చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం బక్తరపల్లి జాతర నేపథ్యంలో కోర్టు వద్దనుండి పది కిలోమీటర్ల దూరం ఈ అతుకులను వేయడానికి అధికారులు పనులు చేపట్టారు. ఇందులో మూడు కిలోమీటర్లు కొత్తగా తారు రోడ్డు నిర్మించిన నేపథ్యంలో ఇక మిగిలిన ఏడు కిలోమీటర్ల మేర పనులు చేపట్టడానికి రూ.1.10 లక్షల నిధులు మంజూరైనట్లు తెలుస్తోంది. ఎంతమేర నిధులు విడుదల అయిందన్న విషయాన్ని బహిర్గంతం చేయడంలో కూడా ఆ శాఖకు చెందిన ఇద్దరు అధికారులు అస్పష్ట సమాధానాలు ఇవ్వటంపై కూడా అనుమానాలకు తావిస్తున్నాయి. ఈ విషయంలో ఉన్నత అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి పనులను పరిశీలించి నాణ్యతా ప్రమాణాలు తగ్గకుండా పనులు జరిగేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

**వివరణ :** ప్యాచ్ వర్క్‌కు సంబందించి రోడ్లు భవనాల శాఖ డిఇ శ్రీనివాసులును వివరణ కోరగా ఈ గతుకుల రోడ్డును పూడ్చడానికి లక్ష పదివేల రూపాయలు మంజూరు అయినట్లు తెలిపారు, ప్రస్తుతం జరుగుతున్న పనుల నాణ్యత గురించి ప్రస్తావించగా అలాంటిది ఏదైనా ఉంటే తన దృష్టికి తీసుకురావాలని అన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా వేసిన ప్యాచ్

## సామాజిక తనిఖీ ప్రజావేదిక

**ప్రజాశక్తి - బత్తలపల్లి**

స్థానిక ఎంపిడిఓ కార్యాలయ ఆవరణలో ఎంపిపి అధ్యక్షతన ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ ప్రజావేదికను మంగళవారం నిర్వహించారు. ఏప్రిల్ 2020 నుండి మార్చి 2021, ఏప్రిల్ 2021 నుండి మార్చి 2022 వరకు మండలంలో జరిగిన పనులపై ఓపెన్ ఫోరం నిర్వహించారు. ఈ వేదికలో సామాజిక తనిఖీలలో వెల్లడైన విషయాలను పంచాయతీల వారిగా చదివి వినిపించారు. ఉపాధి పనుల్లో జరిగిన అక్రమాలకు సంబందించిన మొత్తాన్ని రికవరీ చేస్తున్నట్లు చెప్పారు. ఈకార్యక్రమంలో ఎంపిపి గుర్రం వనజ, పీడీ రామాంజినేయులు, విజిలెన్సు అధికారి రమణారెడ్డి, ఎంపిడిఓ సాయిమనోహర్, ఎస్ఆర్పి లక్ష్మినారాయణ, వైస్ ఎంపిపి వెంగళరెడ్డి, మండల ఇంజనీర్ రమణయ్యతో పాటు అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

## శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయం

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ

**ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్**

జిల్లాలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించే ఎలాంటి వ్యక్తులైన ఉపేక్షించరాదని జిల్లా ఎస్పీ రాహుల్ దేవ్ సింగ్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన మంగళవారం స్థానిక ఎస్పీ కార్యాలయంలో జిల్లా పోలీసు అధికారులతో నెలవారీ నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణలో ఎలాంటి వారితో నైనా రాజీపడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలైన మట్కా, గుట్కా, పేకాట, క్రికెట్ బెట్టింగ్‌లపై ఉక్కుపాదం మోపాలన్నారు. మహిళలపై జరిగే నేరాలను కట్టడి చేచాలన్నారు. పోలీసు వ్యవస్థ పట్ల ప్రజల్లో నమ్మకలిగేలా సిబ్బంది పనితీరు ఉండాలన్నారు. పోలీసు స్టేషన్లకు వచ్చే స్పందన పిటీషనర్ల పట్ల మర్యాదగా వ్యవహరించాలన్నారు. జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో జరుగుతున్న నేరాలపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. పోలీసును ఉద్యోగంగా కాకుండా సేవగా భావించి ప్రజలకు సేవ చేయాలని ఎస్పీ సూచించారు. ఈసమావేశంలో అదనపు ఎస్పీ కేవీ రామకృష్ణ ప్రసాద్, ఎస్‌బి డిఎస్‌పి ఉమ మహేశ్వర రెడ్డి, డిసిఆర్‌బి సిఐ సుబ్బారావు, వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లాలోని పలువురు డీఎస్పీలు, సిఐ లు, ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి జనరల్ థీమ్‌కు ధనాపురం విద్యార్థుల ఎంపిక

**పరిగి:** ఇటీవలే కొత్తచెరువు పాఠశాలలో నిర్వహించిన జిల్లాస్థాయి జనరల్ థీమ్ పోటీలలో పరిగి మండలం ధనాపురం పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనకన బరిచి ననట్లు ఆపాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వరరావు తెలిపారు. తమ పాఠశాలకు చెందిన బిందు శ్రీ జనరల్ థీమ్ లో ప్రతిభ కనపరచగా మంజుల ఆజాద్ కా అమృత్‌మహోత్సవ కార్యక్రమంలో పాల్గొని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైందన్నారు. ధనాపురం పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయిలో గుర్తింపు తెచ్చుకోవడం తమ పాఠశాలకు గర్వకారణమని అన్నారు. ఈ విద్యార్థులకు గైడ్ టీచరుగా వ్యవహరించిన సుకన్యను ఆయన అభినందించారు. అదేవిధంగా క్విజ్ పోటీలలో తమ పాఠశాలకు చెందిన నాగశ్రీ, మనోజ్ఞ, పల్లవి అనే విద్యార్థులు మూడో స్థానానికి ఎంపికైనట్లు ఆయన తెలిపారు. ఈ విద్యార్థులకు గైడ్ టీచర్ గా విజయ భార్గవి వ్యవహరించగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు బహుమతితో పాటు గుర్తింపు పత్రాన్ని డిఈవో మీనాక్షి అందించినట్లు ఆయన తెలిపారు.

విద్యార్థిని ప్రశంసాపత్రం అందజేస్తున్న డిఇఒ

## ఐకమత్యంతో సమస్యల పరిష్కారం

**ధర్మవరం టౌన్ :** ప్రైవేటు స్కూల్స్ నిర్వాహకులంతా ఐకమత్యంతో ఉంటూ సమస్యలను పరిష్కరించుకోవాలని ఎంఇఒ సుధాకర్‌నాయక్, ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు చాంద్‌బాషా తెలిపారు. స్థానిక ఎన్జీవో హోంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ప్రైవేటు స్కూల్ నిర్వాహకుడు జాన్‌రెడ్డి ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్ సభ్యులు శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఉపాధ్యాయులకు 60ఏళ్లకు పదవీ విరమణ ఉంటుందని కాని ప్రైవేటు స్కూల్స్ నిర్వాహకులకు పదవీ విరమణ ఉండదని జీవితాంతం కష్టపడుతూనే ఉండాలని తెలిపారు. ప్రైవేటు స్కూల్స్ నిర్వాహకులు ఐకమత్యంతో పాఠశాలల సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు ఆంజనేయులు, నరేంద్ర, నాగేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జాన్‌రెడ్డిని సన్మానిస్తున్న ఎంఇఒ, తదితరులు

## గర్భిణులకు అన్నదానం

గర్భిణులకు భోజనం వడ్డిస్తున్న రఘువీరారెడ్డి

**మడకశిర రూరల్ :** మండల పరిధిలోని నీలకంఠాపురం గ్రామ పీహెచ్సీ వద్ద గర్భిణులకు శాశ్వత అన్నదాన కార్యక్రమాన్ని మాజీ మంత్రి రఘువీరారెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన తల్లిదండ్రులు నరసమ్మ కావేరప్ప జ్ఞాపకార్థం ఆసుపత్రికి చికిత్స నిమిత్తం వచ్చే గర్భిణులకు శాశ్వత అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో నీలకంఠాపురం వైద్యాధికారితో పాటు, సిబ్బంది పాల్గొన్నారు.

## వేలంపాట వాయిదా

**మడకశిర రూరల్ :** మండలంలోని హరే సముద్రం చేపల చెరువుకు మంగళవారం నిర్వహించాల్సిన వేలం పాట వాయిదా పడింది. ఉదయం పదిన్నర గంటలకు అధికారులు సర్పంచి వేలంపాట నిర్వహణకు సిద్ధమయ్యారు. అయితే 12:30 గంటలైనా కనీసం డిపాజిట్ కూడా చెల్లించేందుకు ఎవరు ముందుకు రాకపోవడంతో వేలంపాటను వాయిదా వేశామని ఇఒఆర్డి శైలజ తెలిపారు.

## శ్మశాన స్థలాన్ని కాపాడండి

**ఓబుల దేవర చెరువు :** మండలంలోని తంగేడుకుంట గ్రామ పరిధిలోని లింగాలపల్లి లో దాదాపు 70 సంవత్సరాల నుంచి ఉన్న శ్మశానస్థలాన్ని కూడా కబ్జా చేస్తున్నారని సిపిఐ నాయకులు విమర్శించారు. దాదాపు 70 సంవత్సరాల నుంచి ఉన్న శ్మశానస్థలం తమదే అని కొందరు బెదిరిస్తున్నారని స్థలానికి డబ్బులు ఇవ్వాలని అంటున్నారని విమర్శించారు. ఈవిషయంలో చర్యలు తీసుకోవాలని కోరుతూ స్థానిక తహశీల్దార్ శ్రీధర్కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు చలపతి, రత్నాబాయ్, రాము, కృష్ణారెడ్డి, రమణ, ప్రసాద్తో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

## వృద్ధులకు దుప్పట్లు పంపిణీ

**కొత్తచెరువు :** మండల పరిధిలోని మైలేపల్లిలో గల కరుణ వృద్ధాశ్రమంలోని వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేసినట్లు తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ తెలిపారు. చలికాలంలో ఆశ్రమంలో ఉన్న వృద్ధులు ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో 15 మందికి దుప్పట్లు, వాకర్లు పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు బేకరి నాయుడు, రామాంజనేయులు, మీడియా కోఆర్డినేటర్ సాయి ప్రసాద్, జస్వంత్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## మూడు విద్యుత్ సబ్స్టేషన్లు మంజూరు

**మడకశిర :** మడకశిర నియోజకవర్గం పరిధిలో వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేయడానికి మూడు విద్యుత్ సబ్స్టేషన్లను ప్రభుత్వం మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి తెలిపారు. మడకశిర మండలంలోని కదిరేపల్లి, గుడిబండ మండలంలోని హిరేతుర్పి, ఆగలి మండలంలోని రామనేపల్లి గ్రామాలలో 33 కెవి విద్యుత్ సబ్ స్టేషన్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో మంగళవారం విద్యుత్ శాఖ ఎడిఇ సుబ్రహ్మణ్య ప్రసాద్, శ్రీకాంత్ ఆయా మండలాల్లో విద్యుత్ శాఖ ఏఈలతో కలిసి స్థలపరిశీలన చేశారు.

## జగనన్న గృహ నిర్మాణాలపై సమీక్ష

**గాండ్లపెంట :** మండల కేంద్రంలోని గ్రామ సచివాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో జగనన్న గృహ నిర్మాణాలపై సచివాలయ సిబ్బంది, వాలంటీర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న ఎంపిపి జగన్మోహన్ మాట్లాడుతూ సచివాలయం పరిధిలో దాదాపు 134 గహాలు మంజూరయ్యాయని ప్రతి లబ్ధిదారుడు గృహాన్ని నిర్మించేలా అవగాహన కల్పించాలని కోరారు. జగనన్న కాలనీలో మౌలిక సదుపాయాలకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ పోరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి రఫీ, వీఆర్వో రమణ, మాజీ జెడ్పీటీసీ భాస్కర్ రెడ్డి, జిల్లా కోఆప్షన్ సభ్యుడు ఎస్ ఫయాజ్ అలీ తదితరులు పాల్గొన్నారు.

## లింగ వివక్షపై అవగాహన ర్యాలీ

**లేపాక్షి :** లింగ వివక్షపై మండల కేంద్రంలో మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. తహశీల్దార్ బాబు ఈ ర్యాలీని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఓరియంటల్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు గిరి, ఐసిడిఎస్ సూపర్వైజర్ గంగ రత్నమ్మ, యానిమేటర్లు మాలతి, మాలమ్మ, ప్రభావతి, నరసింహప్పత పాటు విద్యార్థినులు, అంగన్వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు .

## కార్మికుడికి ఆర్థికసాయం

**కదిరి టౌన్ :** కదిరి మున్సిపాలిటీలో మునిసిపల్ పారిశుధ్య కార్మికుడుగా పని చేసి పదవీ విరమణ పొందిన కే. వేమన్న కుటుంబానికి సిఐటియు అనుబంధ మున్సిపల్ యూనియన్ నాయకులు ఆర్థికసాయం అందజేశారు. ఈసందర్భంగా రూ.3500లను అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు జనార్ధన, బాలకృష్ణ, నరసింహమూర్తి. సి. రామాంజులు, సూరి, రాజు తదితరులు పాల్గొన్నారు.

## వాల్మీకుల ఆత్మీయ సమావేశం

**రొద్దం :** స్థానిక రొద్దకాంబ దేవాలయ ఆవరణంలో మంగళవారం మండల వాల్మీకుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. వాల్మీకి సంఘం మండల అధ్యక్షులు చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా వాల్మీకి సంఘం రాష్ట్ర కన్వీనర్ పెనుకొండ ఈశ్వరయ్య హజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలన్న డిమాండ్తో కలసికట్టుగా పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీలకు చెందిన వాల్మీకి నాయకులు రాచురు తిమ్మయ్య, నరహరి, నీరుగంటి వేణుగోపాల్, నీరుగంటి వీరాంజనేయులు, హరికృష్ణ చంద్ర, నరసింహులు, కోగిర రవి, తురకలపట్నం శ్రీనివాసులు, ప్రసన్న, గోవిందు, ముత్యాలుతో పాటు అధికసంఖ్యలో వాల్మీకి సోదరులు పాల్గొన్నారు.

## ఆలయ అభివృద్ధికి విరాళం

**కదిరి టౌన్ :** రూరల్ మండలం కుమ్మరవాండ్ల పల్లి పంచాయతీ గంగనగారి పల్లిలోని సీతారామ స్వామి ఆలయ అభివృద్ధికి వైసిపి రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ డాక్టర్ బత్తల హరిప్రసాద్ విరాళం అందజేశారు. కుమ్మరవాండ్లపల్లి లోని తన స్వగృహంలో గ్రామస్తులకు రూ. 1.50 లక్షలను అందజేశారు. ఈ సందర్భంగా బత్తల హరి ప్రసాద్ మాట్లాడుతూ గ్రామస్తులు రామాలయ నిర్మాణానికి పూనుకోవడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు చంద్ర, పెద్ద పాపిరెడ్డి, పెద్ద కృష్ణ, లక్ష్మణ, శంకర్, గంగాద్రి, నర్సింహులు, గంగులప్ప తదితరులు పాల్గొన్నారు.

విరాళం అందజేస్తున్న 'బత్తల'

## దిశా చట్టంపై అవగాహన

**కదిరి టౌన్ :** మహిళల భద్రత కోసం దిశా, భారత రాజ్యాంగం వంటి చట్టాలపై విద్యార్థులకు అవగాహన అవసరమని మండల న్యాయ సేవాధికారి సంస్థ చైర్మన్ వెంకటేశ్వరరావు అన్నారు. రాజ్యాంగ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం పట్టణంలోని ఎస్సీ బాలికల హాస్టల్లో న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈసందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థినులకు భారత రాజ్యాంగం గురించి వాటి ప్రాముఖ్యత గురించి, దిశా చట్టం గురించి వివరించారు. ఈ సదస్సులో న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు లింగాల లోకేశ్వర్ రెడ్డి, న్యాయవాది కే నరసింహులు, ఎస్సీ హాస్టల్ వార్డెన్ ప్రసన్నకుమారి సిబ్బంది పాల్గొన్నారు.

## క్రీడాసామగ్రి అందజేత

**ధర్మవరం టౌన్ :** పట్టణంలోని బాలుర ఉన్నతపాఠశాల క్రీడామైదానంలో జిల్లా క్రీడాసాధికార సంస్థ ఆధ్వర్యంలో హాకీ క్రీడాకారులకు క్రీడాసామాగ్రిని మంగళవారం అందజేశారు. జిల్లా క్రీడాభివృద్ధి అధికారి జగన్నాథ్ రెడ్డి ఆధ్వర్యంలో వీటిని అందజేశారు. ఈ కార్యక్రమంలో అనంతపురం జిల్లా హాకీ అసోషియేషన్ కార్యదర్శి బంధం సూర్యప్రకాశ్, కోచ్ హస్సేన్, ధర్మాంబ హాక్ అసోషియేషన్ సెక్రటరీ జెన్నేచంద్రశేఖర్, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

## టిడిపి మండల కన్వీనర్గా గణేష్

**అమరాపురం :** టిడిపి మండల కన్వీనర్గా వీరసముద్రం గణేష్ ఎంపిక పట్ల టిడిపి యువత హర్షం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ తన ఎంపికకు సహరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానన్నారు.

టిడిపి మండల కన్వీనర్ గణేష్

## ప్రత్యేక నిధులతో గ్రామాల అభివృద్ధికి చర్యలు

**ప్రజాశక్తి-హిందూపురం**

హిందూపురం రూరల్ మండలంతో పాటు నియోజక వర్గ వ్యాప్తంగా గ్రామాలను ప్రత్యేక నిధులు తీసుకోచ్చి అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్సీ షేక్ మహమ్మద్ ఇక్బాల్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి రత్నమ్మ అధ్యక్షతన మండల సర్వ సభ్య సమావేశం జరిగింది. సమావేశం ప్రారంభంలోనే పూలకుంట సర్పంచు మంజునాథ్ పోడియం ముందు బైటాయించారు. దారి మళ్లించిన 15వ ఆర్థిక సంఘ నిధులు పంచాయితీలకు ఇవ్వాలని, కరెంటు బకాయిలను రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించాలని, క్లాప్ కార్యక్రమంలో భాగంగా పారిశుధ్య కార్మికుల వేతనాలు ప్రభుత్వం చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశాన్ని బహిష్కరించి, బయటకు వచ్చారు. అనంతరం ప్రారంభం అయిన సమావేశంలో సర్పంచులు, ఎంపిటిసిలు రోడ్డు భవనాల, విద్యుత్ శాఖల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం వివిధ శాఖ అధికారులు తమ శాఖల పనితీరు, ప్రభుత్వం అందిస్తు సంక్షేమ పథకాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్సీ మాట్లాడుతు సమావేశంలో దృష్టికి వచ్చిన ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు. ఈ సమావేశంలో వైస్ ఎంపిపిలు రఘునాథ్ రెడ్డి, రామాంజినేయులు, జెడ్పీటీసీ నాగభూషణం, ప్రత్యేక అధికారి సురేష్కుమార్, ఎంపిడిఒ నరేంద్ర కుమార్, తహశీల్దార్ నాగరాజుతో పాటు ఆయా శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఇక్బాల్

నేలపై కూర్చొని నిరసన వ్యక్తం చేస్తున్న సర్పంచి

## నేలపై కూర్చొని సర్పంచి నిరసన

**ప్రజాశక్తి - రొద్దం**

సర్పంచులకు నిధుల మంజూరు, పంచాయతీలో పనుల నిర్వహణలో ప్రభుత్వం, అధికారులు అనుసరిస్తున్న వైఖరికి నిరసనగా ఓ సర్పంచి వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు. మండలకేంద్రంలో మంగళవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో కంబాలపల్లి సర్పంచి మంజునాథ్ నేలపై కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. సమావేశం ప్రారంభమైన కొద్దిసేపటికి సర్పంచులు తమకు రావాల్సిన 14,15, ఫైనాన్షియల్ నిధుల విషయంలో నిరసన వ్యక్తం చేశారు. సమావేశాన్నిబాయ్ కట్ చేసి బయటికి వెళ్లారు. దీంతో ఎంపీపీ చంద్రశేఖర్, మండల అధికారులు వారితో మాట్లాడారు. రెండో విడత అధిక మొత్తంలో కూడా వచ్చే అవకాశాలు ఉన్నాయని దీంతో పంచాయతీలలో నెలకొన్న సమస్యలు తీరుతాయని అధికారులు నచ్చజెప్పారు. దీంతో సర్పంచులు సమావేశానికి హాజరయ్యారు. ఉపాధి పనులపై చర్చ జరుగుతున్న సందర్భగా తమ పంచాయతీలో ఉపాధి పనులు జరపడం లేదంటూ సమావేశం మధ్యలోనే కంబాలపల్లి సర్పంచి నేలపై కూర్చుని నిరసన వ్యక్తం చేశారు. దీంతో ఎంపిపి ఉపాధి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వాడీవేడిగా ఒక పక్క సమావేశం జరుగుతుండగా పలువురు పంచాయతీ కార్యదర్శులు సెల్ఫోన్లు చూసుకుంటూ కాలక్షేపం చేయడంపై విమర్శలు వెల్లువెత్తాయి.

## ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లపై ప్రభుత్వ తీరు సరికాదు..

విలేకరుల సమావేశంలో పాల్గొన్న నాయకులు

**ప్రజాశక్తి.పుట్టపర్తి అర్బన్**

ఇడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను సుప్రీంకోర్టు సమర్పించడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు ఆక్షేపించారు. మంగళవారం రాయలసీమ జిల్లాల పర్యటనలో భాగంగా ఆ సంఘం నాయకులు పుట్టపర్తికి వచ్చారు. సాయి ఆరామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆర్థికంగా బలహీన వర్గాలు అనే పేరుతో ఆధిపత్య కులాలకు విద్య, ఉద్యోగ రంగాల్లో 10 శాతం రిజర్వేషన్లు కల్పించిన 103 వ రాజ్యాంగ సవరణ చట్టాన్ని సుప్రీంకోర్టు సమర్పించడం, రాజ్యాంగంలో మౌలిక సూత్రాలకు, రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. చట్టసభలలో 50 శాతం బీసీలకు సీట్లు కేటాయించాలని, మండల కమిషన్ సిఫార్సుల మేరకు కుల జనగణన చేయాలని డిమాండ్ చేశారు. రిజర్వేషన్లు సమర్పించిన సుప్రీంకోర్టు పునర్ పరిశీలన చేయాలని కోరారు. రాబోయే రోజుల్లో బీసీలు సంఘటిత శక్తితో ముందుకు పోవాలన్నారు. త్వరలోనే అన్ని జిల్లాల్లో నూతన కమిటీలు నియమిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు కుమ్మర క్రాంతి కుమార్, రాయలసీమ జిల్లాల అధ్యక్షుడు వాల్మీకి హరి, జిల్లా అధ్యక్షుడు నామాల శంకర్, ప్రచార కమిటీ అధ్యక్షుడు సంపంగి గోవర్ధన్, నాయకులు పిసి గంగన్న, లింగమయ్య, నాగభూషణ, రాజ్ కిరణ్, కిరణ్ కుమార్ గౌడ్, సాయిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలి

**ప్రజాశక్తి - బుక్కపట్నం**

విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దడానికి చాత్రోపాధ్యాయులు తమ శిక్షణ పూర్తి చేసుకొని ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎదగాలని డైట్ కళాశాల ప్రిన్సిపల్ రామకృష్ణ ఆకాంక్షించారు. మంగళవారం మండల కేంద్రంలోని డైట్ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ రెండు సంవత్సరాల శిక్షణ కార్యక్రమంలో చాత్రోపాధ్యాయులు తమ శిక్షణ పూర్తి చేసుకొని భవిష్యత్తులో ఉపాధ్యాయ వృత్తి చేపట్టిన తర్వాత విద్యార్థులను బావి భారత పౌరులుగా తీర్చిదిద్దాలని కోరారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక పోటీలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో రూప, జెడ్పీటీసీ శ్రీలత గోవర్ధన్ రెడ్డి , అధ్యాపకులు హరినాథ్ రెడ్డి, వెంకటేశ్వర్లు, అస్లాంబాషా, సురేష్ బాబు, శ్రీనివాస ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## సాగుదారులందరికీ పట్టాలివ్వాలి

**సోమందేపల్లి :** నిరుపేదలు సాగు చేసుకుంటున్న భూములకు సంబంధించి సాగుదారులందరికీ పట్టాలు ఇవ్వాలని వ్యవసాయ కార్మికసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని మారుతి నగర్ లో మంగళవారం నిర్వహించిన నారాయణ గడపగడప మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేను వ్యకాసం నాయకులు కలసి సమస్యను వివరించారు. నియోజకవర్గంలో భూమిలేని దళితులు ,వెనుక వెనుకబడిన వర్గాలకు చెందిన నిరుపేదలందరికీ సాగు భూములకు అసైన్మెంట్ చేసే విధంగా తగు చర్యలు తీసుకోవాలని వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గంగాధర్, రంగప్ప, కొండా వెంకటేశ్, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

సమస్యను వివరిస్తున్న నాయకులు

## ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో శ్రమదానం

**హిందూపురం :** పట్టణంలోని ఎస్డిజిఎస్ కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ప్రత్యేక శిబిరంలో భాగంగా పురపాలక సంఘ పోచనపల్లికి వెళ్లే రహదారిని మంగళవారం శుభ్రం చేశారు. ఈ సందర్భంగా వారు గుంతలకు మట్టి వేసి వాటిని పూడ్చి, రహదారి ఇరు వైపుల ఉన్నా పిచ్చి మొక్కలను తొలగించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ నాగేంద్ర కుమార్, ఎన్ఎస్ఎస్ పోగ్రాం అధికారులు రాజన్న, సత్యనారాయణ, ప్రసాద్, ఎన్ఎస్ఎస్ వాలెంటీర్లు పాల్గొన్నారు.

## బస్సు సర్వీసు ప్రారంభం

**హిందూపురం :** హిందూపురం ఆర్టీసీ డిపో పరిధికి చెందిన హిందూపురం-కదిరికి వెళ్లే నూతన ఆర్టీసీ బస్సు సర్వీసును ఎమ్మెల్సీ ఇక్బాల్, మున్సిపల్ ఛైర్పర్సన్ ఇంద్రజ మంగళవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మేన్లు జబివుల్లా, బలరామిరెడ్డి, ఆర్టీసీ డిపో మేనేజర్ నరేందర్ రెడ్డి, కౌన్సిలర్లు, ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

## 'మా భూములు ఇప్పించండి'

**ప్రజాశక్తి-హిందూపురం**

తమను మోసం చేసి తమ భూములను ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని దళిత రైతులు కోరారు. మంగళవారం స్థానిక ప్రెస్ క్లబ్లో మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు చెన్నయ్యతో కలసి లేపాక్షి మండలం కొండూరు, కొర్లకుంట దళిత రైతులు విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. లేపాక్షి మండలంలోని కొండూరు, కొర్లకుంటకు చెందిన భూమి లేని దాదాపు 80 దళిత కుటుంబాలకు 1961 నుంచి 1991 వరకూ 120 ఎకరాల అసైన్డ్ భూమిని ప్రభుత్వం కేటాయించిందన్నారు. చదువు రాని తమ వద్ద ఎకరాకు రూ.20 లక్షల రుణాలు ఇప్పిస్తామని, తమ పిల్లలకు ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పి ఆర్గానిక్ ప్రాడెక్ట్ యాజమాన్యం వారు కొందరు తమనుంచి సంతకాలు, వేలిముద్రలు తీసుకుని ఆ భూమిలో నిర్మాణాలు చేపట్టారన్నారు. అయితే ఇప్పటి వరకు తమకు ఎలాంటి రుణాలు రాకపోవడంతో అనుమానం వచ్చి వారిని నిలదీశామన్నారు. ఈ భూములు తమవని, వీటిని తమకు విక్రయించారనిఇక్కడి నుంచి వెళ్లిపోవాలని బెదిరింపులకు దిగుతున్నారన్నారు. ఇందుకు లేపాక్షికి చెందిన కొందరూ రెవెన్యూ అధికారులు సహకరించారని ఆరోపించారు. నిపై సంబంధిత అధికారులు విచారణ జరిపి తమ భూములను తమకు ఇప్పించాలని వారు కోరారు. ఆక్రమణదారులకు సహకరించిన అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బాధిత రైతులు గోపాలకృష్ణ, గంగాధరప్ప, గంగాధర్, పెద్ద తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయం

**తాడిమర్రి :** మండలంలోని చిల్లవారి పల్లిలో మంగళవారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన ఇంటింటికి తిరిగి ప్రజాసంక్షేమ పథకాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా పలువురు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పాటిల్ భువనేశ్వర్ రెడ్డి, సర్పంచి శివారెడ్డి, నాయకులు విజయభాస్కర్ రెడ్డి, గోపాల్ రెడ్డి, వైటి చంద్రశేఖర్ రెడ్డితోట పాటు తహశీల్దార్ నాగరాజు, ఎంపీడీవో విజయలక్ష్మి ఆయా శాఖల అధికారులు, వైసిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**మడకశిర రూరల్ :** రాష్ట్రంలో సంక్షేమ రాజ్యం జగనన్నతోనే సాధ్యమని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి అన్నారు. మండలంలోని మెలవాయి గ్రామంలో మంగళవారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సరోజమ్మ, ఎంపీపీ కవిత, సర్పంచి రంగనాథ, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు మంజునాథ్, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు, ఎంపీడీవో నరసింహమూర్తి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు

**తనకల్లు** తనకల్లు-3 గ్రామ సచివాలయం పరిధిలోని వంకపల్లి, డేగానివారిపల్లి, చిన్న కడపలవాండ్లపల్లి, కుంటమరవ, పెద్ద కడపలవాండ్లపల్లి, గ్రామాలలో మంగళవారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ పివి సిద్ధారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి తిరిగి ప్రభుత్వం చేపట్టిన ప్రజా సంక్షేమ పథకాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కౌసల్య హేమంత్ కుమార్ నాయుడు, మండల కన్వీనర్ మధుసూదన్ రెడ్డి, ఎంపీడీవో నరసింహులు, సర్పంచ్ సరస్వతి, ఎంపీటీసీలు సర్పంచులు, ఆయా శాఖల అధికారులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## తల్లీకొడుకు ఆత్మహత్యాయత్నం

**ధర్మవరం టౌన్ :** కుటుంబ కలహాలతో తల్లీ కొడుకు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన పట్టణంలోని శ్రీలక్ష్మీ చెన్నకేశవపురంలో మంగళవారం చోటు చేసుకుంది. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాలు.. లక్ష్మీ చెన్నకేశవపురంలో బాబు అనే వ్యక్తి చికెన్ సెంటర్ నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. బాబుకు ఆయన భార్య వసుంధర మనస్పర్థలతో గొడవపడ్డారు. ఈ క్రమంలో తీవ్రమనస్థాపానికి గురైన బాబు పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఇది గమనించిన బాబు తల్లి ఈశ్వరమ్మ క్షణికావేశంతో తాను కూడా పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన స్థానికులు వీరిద్దరిని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బాబు పరిస్థితి విషమంగా ఉండటంతో అనంతపురానికి తరలించారు. ఈశ్వరమ్మ ధర్మవరం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## చోరీ కేసులో నిందితులు అరెస్టు

**చెన్నేకొత్తపల్లి :** పంట పొలాల్లో ఉన్న స్ప్రింక్లర్లు, వాటి పైపులను చోరీ చేశారన్న కేసులో ముగ్గురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్కు పంపినట్లు పోలీసులు తెలిపారు. మండలంలోని దామాజిపల్లి, వెంకటాంపల్లిలో జరిగిన చోరీ కేసులో నిందితులను అరెస్టు చేసినట్లు ఎస్ ఐ శ్రీధర్ బాబు తెలిపారు.

## కర్నాటక మద్యం ధ్వంసం

**కొత్తచెరువు :** 2020- 21 సంవత్సరంలో అక్రమంగా తరలిస్తుండగా పట్టుబడిన మద్యాన్ని పోలీసులు మంగళవారం ధ్వంసం చేశారు. స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో మాధవి ఆధ్వర్యంలో స్థానిక పోలీసులతో కలిసి మద్యాన్ని జెసిబి సాయంతో ధ్వంసం చేశారు. 11 కేసుల్లో పట్టుబడిన 24 లీటర్ల మద్యం, సారాయిని ధ్వంసం చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ రాజన్న, ఎస్ఐ లింగన్న, పోలీసులు పాల్గొన్నారు.

## సైన్స్పై విద్యార్థులు ఆసక్తి కనబరచాలి

నమూనాను ప్రదర్శిస్తున్న విద్యార్థిని

**కొత్తచెరువు :** సైన్స్ పట్ల విద్యార్థులు ఆసక్తి కనపర్చాలని ఎన్సిఎస్సి జిల్లా కోఆర్డినేటర్ వెంకటస్వామి, సైన్స్ క్రియేటర్ ఆనంద్ భాస్కర్ రెడ్డి తెలిపారు. మంగళవారం కొత్తచెరువులోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన 30వ జాతీయ సైన్స్ కాంగ్రెస్ సమావేశంలో జిల్లాలోని 16 మండలాలకు చెందిన 50 పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. ఈసందర్భంగా వారు 70 ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం చెన్నకృష్ణారెడ్డి, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ చంద్రమౌళి, ప్రాజెక్టు జడ్జి నాగరాజు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**చిలమత్తూరు :** కోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కాంప్లెక్స్ స్థాయిలో విజ్ఞాన ప్రదర్శనను మంగళవారం నిర్వహించారు. ఈ ప్రదర్శనలో విద్యార్థులు 50 రకాల నమూనాలను ప్రదర్శించారు. కాంపెక్స్ స్థాయిలోని పాఠశాల ఉపాధ్యాయులు వాటిని సందర్శించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రఘునాథ్, సైన్స్ ఉపాధ్యాయులు జనార్ధన్, ఇమ్రాన్, చంద్రమోహన్ పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్సీ గ్రూపునకే పార్టీ పదవులు

**మడకశిర :** నియోజకవర్గంలోని ఐదు మండలాలతో పాటు ,మడకశిర నగర పంచాయతీకి తెలుగుదేశం పార్టీ మండల కన్వీనర్లు ప్రధాన కార్యదర్శులను నియమిస్తూ పార్టీ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు నుంచి ఉత్తర్వులు అందాయి. అయితే అందులో ఎక్కువగా మాజీ ఎమ్మెల్సీ గ్రూపునకు చెందిన వ్యక్తుల పేర్లే ఉన్నాయన్న విమర్శలు వినపడుతున్నాయి. మడకశిర పట్టణ అధ్యక్షుడిగా మనోహర్, ప్రధాన కార్యదర్శిగా పుల్లయ్య చౌదరి, మడకశిర రూరల్ అధ్యక్షుడిగా లక్ష్మీనారాయణ, కార్యదర్శిగా కోట్ల రంగే గౌడ్, రొళ్ల మండల అధ్యక్షుడిగా దాసి రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఈరన్న, ఆగలి మండల అధ్యక్షుడిగా కుమారస్వామి, ప్రధాన కార్యదర్శిగా జయప్ప, అమరాపురం మండల అధ్యక్షుడిగా గణేష్, ప్రధాన కార్యదర్శిగా జయరామప్ప, గుడిబండ మండల అధ్యక్షుడిగా మద్దనుకుంటప్ప, ప్రధాన కార్యదర్శిగా ప్రకాష్ను ఎంపిక చేశారు. అదే విధంగా క్లస్టర్ ఇన్ఛార్జులను కూడా నియమించారు. నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్సీ గుండుమల, మాజీ ఎమ్మెల్యే ఈరన్నకు చెందిన రెండు గ్రూపులు ఉండగా గుండుమల గ్రూపునకు చెందిన వారికే పదవులు దక్కాయన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

## చిత్తశుద్ధితో విధుల నిర్వహణ

**పుట్టపర్తి అర్బన్ :** సచివాలయాల్లో పనిచేసే ఉద్యోగులు ప్రజా సమస్యలపై చిత్తశుద్ధితో పనిచేయాలని జిల్లా కలెక్టర్ బసంత్ కుమార్ ఆదేశించారు. మంగళవారం పట్టణంలోని జండా వేపమాను వీధిలో గల 2వ వార్డు సచివాలయం, పెద్ద బజారులోని 3వ వార్డు, కర్ణాటక నాగేపల్లి 5వ వార్డు సచివాలయాలను కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు అంకితభావంతో పని చేయాలన్నారు. తప్పనిసరిగా యూనిఫారం ధరించాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హుల అందరికీ అందే విధంగా కషి చేయాలన్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి, కౌన్సిలర్ చెరువు భాస్కర్ రెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థులు

**నంబులపూలకుంట :** రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు నంబులపూలకుంట మండలానికి చెందిన విద్యార్థి ఎంపికయ్యారు. హిందూపురంలో అండర్ -17 విభాగంలో జరిగిన వాలీబాల్ పోటీల్లో ఎన్పీకుంట మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థి ఎన్నికయ్యారు. ఈసందర్భంగా వైసిపికి చెందిన బిసి నాయకుడు బాలకృష్ణనాయుడు ప్రతిభా విద్యార్థిని అభినందించారు. ప్రతిభా విద్యార్థికి తనవంతుగా రూ. 5వేలను అందజేశారు. అంతేకాకుండా క్రీడాకారులందరికీ రూ.30వేల విలువజేసే క్రీడాదుస్తులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిషత్తులో వాలీబాల్ క్రీడలో బాగారాణించి ఉన్నతస్థానానికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం తిరుపాల్నాయక్, పీడీ షఫీ, ఉపాధ్యాయులు మురళి, వెంకటరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**హిందూపురం :** రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ ఆధ్వర్యంలో ఈనెల 24 నుంచి 26 వరకు విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి పాలిటెక్ ఫెస్ట్-2022లో స్థానిక హిందూపురం మహిళా పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థినులు ప్రతిభ చాటారు. డి-ఫార్మసీ విద్యార్థులు సౌమ్యశ్రీ, రంజిత, మానస, హేమావతి క్యూ ఆర్ కోడ్ను స్కాన్ చేయడం ద్వారా కాలం చెల్లిన మందులను వాడకాన్ని అరికట్టడం, ప్రతి టాబ్లెట్లో ఏ ఔషధం ఉంది అన్న విషయాన్ని సంగ్రహించవచ్చు అన్న విషయాలను ప్రదర్శించారు. లేబిలింగ్ ఆఫ్ ఫార్మస్యూటికల్స్ విత్ క్యూఆర్ కోడ్ ప్రాజెక్టునకు రాష్ట్రస్థాయిలో తృతీయ బహుమతి, ఫార్మసీ విభాగంలో మొదటి బహుమతి లభించినట్లు ఫార్మసీ హెచ్ఒడి తెలిపారు.

## ఈడిగ బిసి సాధికార సమితి జిల్లా అధ్యక్షులుగా నీళ్ల రమణ

**పుట్టపర్తి అర్బన్ :** జిల్లా ఈడిగ బీసీ సాధికార సమితి జిల్లా అధ్యక్షులుగా పుట్టపర్తికి చెందిన ఈడిగ నీళ్ల రమణ గౌడ్ ఎంపికయ్యారు. ఈ మేరకు టిడిపి రాష్ట్ర బీసీ అధ్యక్షుడు కోళ్ల రవీంద్ర, ఈడిగ సాధికారిత రాష్ట్ర అధ్యక్షుడు అమర్నాథ్ గౌడ్ నుంచి మంగళవారం నియామక ఉత్తర్వులను రమణగౌడ్ అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తాను పార్టీ ఆవిర్భావం నుంచి టిడిపి అభివృద్ధికి కృ షి చేశానని తెలిపారు. తన పైన నమ్మకంతో ఈ పదవికి ఎంపిక చేసినందుకు జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు, నారా లోకేష్, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, జిల్లా పార్టీ అధ్యక్షుడు బి కె పార్థసారధికి, తన ఎంపికకు సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. జిల్లాలోని ఈడిగల హక్కుల కోసం, గీత కార్మికుల సమస్యల పరిష్కారం కోసం, టిడిపి అభివృద్ధి కోసం పాటుపడతానని చెప్పారు.

**IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE, PENUKONDA**
**O.S. 22/2016**

**Between:**
N.Vinay Kumar and others ...Plaintiffs
And
M.Varalakshimi Bai and Others ...Defendants

To:
Shantha Bai W/o Nagabhushanarao, D.No.6, 6th Cross, Nandini Layout, Bengaluru.

**NOTICE**

Please take notice that the plaintiffs Have field a susit in the above court for declaration of Title and for other reliefs and you are also added as party to the above suit the above suit is posted for your appearance to 02-12-2022. Hence you are Hereby informed to appear befor e the above said court on the above said date at 10.00 A.M. without fail otherwise the above Suit wil be decided on your abscence

(By order of the Court)
K.S. RAJASEKHAR, B.Sc., LLB
Advocate, Penukonda.